క్లుప్తంగా

ఫిర్యాదుల పరిష్కారమే లక్ష్యం



మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

జి.సిగడాం: గ్రీవెన్స్‌లో వచ్చిన ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించడమే లక్ష్యమని, విధి నిర్వహణలో అధికారులు అలసత్వం వహించ వద్దని తహసీల్దార్ ఎం.శ్రీకాంత్ అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. గ్రామాల్లో రైతుల భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించామని, ఎవరూ కార్యాలయాల చుట్టూ తిరిగి కాలాని వృథా చేయవద్దని సూచించారు. ప్రజల నుంచి సమస్య వచ్చిన వెంటనే సంబంధిత కార్యదర్శులు, వీఆర్వో, ఆర్ఐల ద్వారా పూర్తి సమాచారం తెచ్చుకుని, పరిష్కారం అయ్యేవిధంగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. కార్యకమంలో ఎంపీడీవో జి.రామకృష్ణారావు, ఎంఈవో అరసాడ రవి, ఏపీఎం రెడ్డి రామకృష్ణంనాయుడు, ఏపీవో చోళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న శ్రీరామమూర్తి

జి.సిగడాం: మండలంలోని సంతవురిటి నుంచి దవళపేట పంచాయతీ విజయరాంపురం గ్రామానికి వెళ్లే ప్రధాన రహదారిలో బీటీ రోడ్డు నిర్మాణంపై కలెక్టర్ గ్రీవెన్స్‌లో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి పేడాడ శ్రీరామమూర్తి సోమవారం ఫిర్యాదు చేశారు. రెండు గ్రామాల మధ్యలో ఉన్న చిన్న చిన్న వాగుల మీద పాత కల్వర్టులు ఉన్నాయని, వాటిని తొలగించకుండా రోడ్డు వేస్తున్నారని వెల్లడించారు. కొత్త కల్వర్టులు నిర్మించకపోతే రైతులు, వాహదారులకు ఇబ్బందులు తప్పవని ఆవేదన వ్యక్తం చేశారు.

అడిషనల్ డైరక్టర్ ఆకస్మిక పర్యటన



మాట్లాడుతున్న అడిషనల్ డైరక్టర్ డాక్టర్ సింహాచలం

శ్రీకాకుళం రూరల్: మండలంలోని పలు ప్రాంతాల్లో పశు సంవర్ధక శాఖ రాష్ట్ర అడిషనల్ డైరక్టర్ డాక్టర్ వై.సింహాచలం సోమవారం పర్యటించారు. వప్పంగి గ్రామాన్ని సందర్శించి అక్కడ పశువులకు అందుతున్న వైద్య సేవలు గురించి రైతులను అడిగి తెలుసుకున్నారు. సకాలంలో పశువులకు టీకాలు వేయిస్తే ఎటువంటి వ్యాధులు రావన్నారు. కార్యక్రమంలో మండల పశు సంవర్ధక శాఖాధికారి దిలీప్, బాలకృష్ణ, పార్టీ నాయకులు చల్లా రవికుమార్, ఉమ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీల పెంపు సరికాదు

శ్రీకాకుళం పాతబస్టాండ్: నిత్యావసర సరుకుల ధరల పెంపుదలతో సతమతమవుతున్న ప్రజానికంపై విద్యుత్ చార్జీల పెంపు సరికాదని శ్రీకాకుళం టాక్స్ పేయర్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు తమ్మన భాస్కర్, మణికొండ ఆదినారాయణమూర్తి అన్నారు. ఈ మేరకు మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కి వినతిపత్రం సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అదనపు సర్దుబాటు చార్జీల రూపంలో అధికంగా బిల్లుల వసూలు చేయడం సమర్ధనీయం కాదన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు స్మార్ట్ మీటర్లను వ్యతిరేకించిన టీడీపీ, ఇప్పుడు స్మార్ట్ మేట బిగింపునకు ఆదేశాలు ఇవ్వడం సరికాదన్నారు. కార్యక్రమంలో కొయ్యాన నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలి



సర్పంచ్‌లతో సమావేశం నిర్వహిస్తున్న ఎస్ఐ రాము

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని 23 పంచాయతీల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని రూరల్ ఎస్ఐ రాము పిలుపునిచ్చారు. సోమవారం శ్రీకాకుళం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సర్పంచ్‌లతో ఆయన సమావేశం నిర్వహించారు. గ్రామాల్లోని ప్రధాన ప్రాంతాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, దీనివల్ల గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు సంచరిస్తే తెలుస్తాయన్నారు. ఎక్కడైనా అసాంఘిక కార్యకలాపాలు జరిగితే వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ఆకతాయిలు ఎవరైనా గంజాయి వంటి మత్తు పదార్థాలు సేవిస్తే సమాచారం ఇవ్వాలన్నారు.

‘ఉపాధి’కి ఎదురుచూపులు..!

- ముగిసిన వ్యవసాయ పనులు
- ఇంకా ప్రారంభమవ్వని ఉపాధి పనులు
- ఎదురుచూస్తున్న వేతనదారులు



ఎచ్చెర్లలో ఉపాధి పనులు నిర్వహిస్తున్న దృశ్యం(ఫైల్)



పిచ్చి మొక్కలతో నిండిన చెరువు

ఎచ్చెర్ల క్యాంపస్: మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పల్లెల్లో ఎంతో కీలకమైనది. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నిర్మూలన, అభివృద్ధి రెండు లక్ష్యాలతో ముందుకు సాగుతుంది. చెరువులు, కాలువలు, మట్టిరోడ్ల అభివృద్ధి వంటివి ఉపాధి పనుల్లో భాగంగా చేపడుతుంటారు. అయితే ఈ ఏడాది ఇంకా ఉపాధి పనులు ప్రారంభమవ్వకపోవడంతో లబ్ధిదారులు ఎదురుచూపులు చూస్తున్నారు.

ఎచ్చెర్ల నియోజకవర్గంలో...

ఎచ్చెర్ల నియోజకవర్గంలోని ఎచ్చెర్ల, లావేరు, జి.సిగడాం, రణస్థలం మండలాల్లో చెరువులు, కాలువలు ఎక్కువగా ఉన్నాయి. తోటపల్లి, మడ్డువలస, నారాయణపురం వంటి కాలువలు ఇక్కడ అత్యంత కీలకమైనవి. అయితే కాలువలు, చెరువుల్లో జంగిల్ క్లియరెన్స్ వంటి పనులకు ప్రస్తుతం సమయం అనువైనది. వాస్తవానికి రైతులకు జూన్ నుంచి డిసెంబర్ వరకు మాత్రమే వ్యవసాయ పనులు ఉంటాయి. అందువలన జాబ్‌కార్డు ఉన్నవారికి 100 రోజుల పనిలక్ష్యం చేరుకోవాలంటే జనవరి చివరి నుంచి ఫిబ్రవరి, మార్చి, ఏప్రిల్, మే నెలల్లో పనులు నిర్వహించాల్సిన అవసరం ఉంది అని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మండలం	జాబ్ కార్డు ఉన్న కుటుంబాలు	వేతనదారులు
ఎచ్చెర్ల	18,997	30,051
రణస్థలం	21,646	37,377
లావేరు	15,141	26,327
జి.సిగడాం	12,091	23,145

పథకంలో మార్పులు

ప్రస్తుతం ఉపాధి హామీ పథకంలో కొన్ని మార్పులు సైతం చేస్తున్నారు. మేట్లు గతంలో మహిళలు ఉండేవారు. ప్రస్తుతం పురుషులకు సైతం అవకాశం కల్పిస్తున్నారు. మొత్తం మీద 50 మందికి ఒక మేట్ ఉంటున్నారు. 19 నుంచి 50 ఏళ్ల మధ్య వయస్సు వారిని నియమిస్తున్నారు. మరోపక్క గరిష్ట వేతనం రూ.300లకు పెంచారు. గరిష్ట వేతనం అమలు కావాలంటే తప్పనిసరిగా వేతనదారుల్లో అవగాహన ఉండాలి. పనిసైతం అదేస్థాయిలో జరగాలి. ప్రస్తుతం పనులు లేని వేతనదారులు పనుల కోసం ఎదురు చూస్తున్నారు. వ్యవసాయ ఆధారిత పనులు మాత్రమే కొన్ని చోట్ల జరుగుతున్నాయి. అందువలన పనులు త్వరితగతిన ప్రారంభించాలని వేతనదారులు కోరుతున్నారు.

పనులు ప్రారంభించాలి



ప్రస్తుతం ఎటువంటి వ్యవసాయ పనులు లేకపోవడంతో ఖాళీగా ఉన్నాం. ఇప్పుడు ఉపాధి పనులు ప్రారంభిస్తే ఆర్థికంగా ప్రయోజనం ఉంటుంది. లేదంటే ఆర్థికంగా ఇబ్బందులు పడతాం. పనులు చేసేందుకు వాతావరణం సైతం అనుకూలంగా ఉంది. చెరువులు, చెరువు గట్లపై తుప్పలు వ్యాపించి ఉన్నాయి.

– జరుగుళ్ల సిమ్మయ్య, జరజాం, ఎచ్చెర్ల

పూర్తిస్థాయిలో పని కల్పించాలి



నిబంధనల మేరకు ఉపాధి పనులు 100 రోజులు కల్పించాలి. గరిష్ట వేతనం వచ్చేలా చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం పనులు ప్రారంభమవ్వకపోవడంతో పనుల కోసం ఎదురు చూస్తున్నాం. పనులకు అనుకూలించే సమయం ఇది. ప్రభుత్వం స్పందించి పనుల ప్రారంభంపై దృష్టి పెట్టాలి.

– మెట్ట ప్రసాద్, ఎస్ఎంపురం పేట, ఎచ్చెర్ల

త్వరలో పనులు ప్రారంభిస్తాం

ఉపాధి హామీ పథకం నిబంధనల మేరకు జాబ్ కార్డు ఉన్న ప్రతీ కుటుంబానికి 100 రోజుల పని కల్పిస్తాం. ప్రతినెలా చేయాల్సిన పనులు చేస్తాం. మేట్‌ల నియామకం, పనులపై అవగాహన కార్యక్రమాలు వంటివి చేపడుతున్నాం. త్వరలో పనులు ప్రారంభిస్తాం.

– లోకేష్, ఏపీడీ డ్వామా, ఎచ్చెర్ల మండలం

చిన్నారుల కోసం ఏర్పాట్లు చేయాలి

శ్రీకాకుళం అర్బన్: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి దేవస్థానంలో ఫిబ్రవరి 4న నిర్వహించనున్న రథసప్తమి వేడుకల్లో భాగంగా బాలల హక్కుల పరిరక్షణ, వారి సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని తగినన్ని ఏర్పాట్లు చేయాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. క్యూలైన్లలో తల్లులు పాలుపెట్టే ప్రత్యేక కేంద్రాలు, గర్భిణులు, బాలింతలకు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు, దివ్యాంగ బాలల హక్కుల ఉల్లంఘనలు జరగకుండా దర్శన ఏర్పాట్లు, ట్రై సైకిళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు, చిన్న పిల్లల వైద్యులుండేలా వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, వేడి పాలు, బిస్కెట్లు విరివిగా పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. అలాగే స్త్రీ, శిశు సంక్షేమ, 1098 చైల్డ్ లైన్, కార్మికశాఖ అధికారులు, సిబ్బంది సమన్వయంతో బాలకార్మికులు, బాల యాచకులు లేకుండా, తప్పిపోయిన పిల్లలను త్వరితగతిన తల్లిదండ్రుల చెంతకు చేర్చేలా ముందస్తు ప్రణాళికలు రూపొందించుకొని బాలల హక్కుల ఉల్లంఘనలు, వారి సంక్షేమానికి పెద్దపీట వేసి రథసప్తమి వేడుకలు విజయవంతం చేయాలని సీతారాం సూచించారు.

ఎమ్మెల్యే శంకర్ ఆగ్రహం

అరసవల్లి: రథసప్తమి మహోత్సవాల సందర్భంగా అరసవల్లి ఆలయ పరిసరాల్లో జరుగుతున్న అభివృద్ధి పనుల్లో జాప్యం జరుగుతోందని, తాను చెప్తున్నప్పటికీ సిబ్బంది సరిగా పనిచేయడం లేదని ఎమ్మెల్యే గొండు శంకర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం ఉదయం అరసవల్లిలో పనులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆలయం ఎదుట ఇటీవల సేకరణ చేసిన స్థలానికి సంబంధించి మార్కింగ్ జరిగినప్పటికీ తదుపరి చర్యలు ఎందుకు చేపట్టలేదంటూ ఎమ్మెల్యే చిందులేశారు. దీనిలో నిర్లక్ష్యం వహించిన ఎండోమెంట్ సర్వేయర్ దుర్గా ప్రసాద్‌పై, అలాగే పర్యవేక్షణ చేయాల్సిన ఈవో భద్రాజీలపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ నిర్లక్ష్యం కారణంగా సీసీ రోడ్డు నిర్మాణంలో జాప్యం జరిగిందని అసంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే అరసవల్లి ఏర్పాట్ల విషయంలో మీడియా పాత్ర బాధ్యతాయుతంగా లేదని, ఈ పరిసరాల్లోకి మీడియా అనుమతిపై చర్యలు చేపట్టాలంటూ వన్‌టౌన్ ఎస్సై హరికృష్ణకు ఆదేశించారు. ఇదిలావుంటే రథసప్తమి ఉత్సవ ఏర్పాట్లులో భాగంగా రాత్రింబవళ్లు పనిచేస్తున్న ఆలయ ఈవో వై.భద్రాజీపై ఎమ్మెల్యే ఆగ్రహం వ్యక్తం చేయడాన్ని స్థానికులతో పాటు ఆలయ ఉద్యోగులు సైతం తప్పుపట్టారు.

జిల్లా పరిషత్‌లో కారుణ్య నియామకాలు



నియామకపత్రాలను అందజేస్తున్న దృశ్యం

అరసవల్లి: జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేసి మెడికల్ అన్‌ఫిట్ లేదా మరణించిన ఉద్యోగుల కుటుంబాల్లో ఒకరికి సాంఘిక భద్రతా పథకం కింద ఉద్యోగాలను కల్పిస్తూ నియామక పత్రాలను జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ అందజేశారు. ఈ మేరకు సోమవారం జెడ్పీ బంగ్లాలో సీఈవో శ్రీదర్ రాజా సమక్షంలో పలువురు అర్హులకు నియామక పత్రాలను అందజేశారు. మొదలవలస శరత్, వంజరాపు శ్రీకాంత్, లిమ్మల చైతన్యకుమార్, గమ్మంగి రోషన్ మహారాజ్, తెలికచర్ల చందనశిల్పలకు ఉద్యోగ నియామక పత్రాలతో పాటు విధుల స్థానాలను కూడా కేటాయించారు.

అకారణంగా సమావేశం



తల్లిదండ్రుల సమావేశం నిర్వహిస్తున్న దృశ్యం

గార: మేజర్ పంచాయతీ శ్రీకూర్మంలోని చింతువలస ప్రైమరీ పాఠశాలలో ఏ అవసరం లేకుండానే స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సమావేశం హెచ్ఎం గొండు భారతి అధ్యక్షతన సోమవారం పెట్టారు. దీంతో సమావేశాన్ని ఎందుకు నిర్వహిస్తున్నారో తెలుసుకోవడానికి యువకులు, గ్రామస్తులు ఎక్కువ మంది అక్కడికి చేరారు. అయితే తరగతి గది తలుపులు వేసి సమావేశం నిర్వహించారు. స్కావెంజర్, కుక్ కమ్ హెల్పర్‌ను తొలగించడానికి సమావేశం నిర్వహించేందుకు సమాయత్తమైనట్లు తెలిసింది. అదే గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, స్కూల్ సమీపంలోని వ్యక్తి కూడా సమావేశంకు హాజరవ్వడంతో వివాదం ముదిరింది.

సమస్యలు పరిష్కరించాలి



ఈడీ విజయ్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం అందజేస్తున్న సంఘ నాయకులు

శ్రీకాకుళం అర్బన్: ఏపీఎస్ ఆర్టీసీలో ఔట్ సోర్సింగ్ విధానంలో పనిచేస్తున్న కార్మికులు, సిబ్బంది సమస్యలను పరిష్కరించాలని ఏపీపీటీడీ రీజనల్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ విజయ్‌కుమార్‌ను సోమవారం ఏపీఎస్ ఆర్టీసీ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ సభ్యులు విజ్ఞప్తి చేశారు. సోమవారం కార్యాలయంలో విజయ్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి కార్మికుల సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు మాట్లాడుతూ జిల్లాలో నాలుగు డిపోల్లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ కార్మికులకు యాజమాన్యం నిర్ణయించిన జీతాలు కాంట్రాక్టర్లు ఇవ్వడం జరగడం లేదని, సమాన పనికి సమాన వేతనం, ఉద్యోగ భద్రత కల్పించాలని, కాంట్రాక్ట్ విధానం రద్దు చేసి నేరుగా ఆర్టీసీ యాజమాన్యమే కార్మికుల బ్యాంక్ అకౌంట్‌కు జీతాలు ఇచ్చే విధంగా కృషి చేయాలని కోరారు. ఈడీ విజయ్‌కుమార్ సానుకూలంగా స్పందించి తగు న్యాయం చేస్తామని హామీ ఇచ్చినట్టు సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. ఔట్ సోర్సింగ్ అసోసియేషన్ రాష్ట్ర నాయకులు ముత్యాలరావు, జిల్లా అధ్యక్షుడు దాసరి కిరణ్, కార్యదర్శి సంతోష్, కోశాధికారి ఆర్.నవీన్, అనిల్, రామ్మోహన్, రాజారావు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం నేడు

జి.సిగడాం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుంటముక్కల రామకృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన నిర్వహించే సమావేశానికి గౌరవ సభ్యులు, అధికారులు విధిగా హాజరవ్వాలని కోరారు.

అవినీతిపై దర్యాప్తు చేయాలి



గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేస్తున్న రాజారావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: పశు సంవర్ధకశాఖలో 2019కి ముందు జరిగిన రూ.11 కోట్లు అవినీతిపై పూర్తిస్థాయిలో దర్యాపు చేపట్టాలని ఇనప రాజారావు కోరారు. ఈ మేరకు మీకోసం కార్యక్రమంలో కలెక్టర్‌కు సోమవారం వినతిపత్రం అందజేశారు. ఈ విషయంపై గతంలో పలుమార్లు ఫిర్యాదు చేయడం జరిగిందన్నారు. ఈ అవినీతిలో ఆరోపణలు ఉన్నవారికి ఈ బాధ్యతలు అప్పగించకుండా, వేరేవారితో విచారణ చేయించాలని విన్నవించారు. అతనితో పాటు పలువురు దళిత రైతులు ఉన్నారు.

విచారణ తాత్కాలిక వాయిదా

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖలో సంచలనం రేపిన ఎస్.ధనలక్ష్మి ఫిర్యాదు వ్యవహారంలో నిజ నిర్ధారణకై మంగళవారం జరగాల్సిన విచారణ తాత్కాలికంగా వాయిదా పడిందని డీఎంహెచ్‌వో కార్యాలయం ప్రకటించింది. ఈ మేరకు ఏవో బాబూరావు తమకు సమాచారం అందించారని ఫిర్యాదుదారు తెలియజేశారు. ఇదిలా ఉండగా తదుపరి విచారణ తేదీ తర్వాత ప్రకటించనున్నారన్నారు. వైద్యశాఖలో అధికారుల నిర్ణయాలు, చర్యలపై తమకు అనుమానాలున్నట్లుగా బాధిత కుటుంబసభ్యులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

అరసవల్లి: అరసవల్లి సూర్యనారాయణ స్వామివారి ఆలయంలో అమలవుతున్న నిత్యాన్నదాన పథకానికి నగరానికి చెందిన పొట్నూరు గురునాథస్వామి జ్ఞాపకార్థం ఆయన కుటుంబ సభ్యులు రూ.1,00,001 విరాళంగా అందజేశారు. ఈ మేరకు ఆలయ సూపరింటెండెంట్ కనకరాజుకు సోమవారం విరాళాన్ని అందజేశారు. కాగా రథసప్తమికి డోనర్ పాసులను అందజేస్తున్నట్లుగా ఆయన ప్రకటించారు.

పశువులు పట్టివేత

ఎచ్చెర్ల: లావేరు మండలంలోని భీమునిపాలేం రోడ్డులో బోలెరో వ్యానులో అక్రమంగా తరలిస్తున్న పశువులను లావేరు ఎఎస్ఐ బి.జగన్‌మోహన్‌రావు సోమవారం పట్టుకున్నారు. బుడుమూరు నుంచి భీమునిపాలేం వైపు వెళ్తున్న బోలెరో వ్యానులో ఈ పశువులను తరలిస్తుండగా పట్టుకోవడం జరిగిందని తెలిపారు. ఇందులో 9 ఆవులు ఉన్నట్లు తెలిపారు.

సూపర్ సింగర్‌గా తరుణి

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని గుజరాతీపేటకు చెందిన పొట్నూరు తరుణి ఈనెల 24న విశాఖలో రేడియోసిటీ 91.1 ఎఫ్ఎం సూపర్ సింగర్ పోటీలో బెస్ట్ సింగర్‌గా ఎన్నికైంది. ఈ మేరకు తరుణి మాట్లాడుతూ సీజన్ 16లో జరిగిన ఈ పోటీలో సుమారు 3వేల మంది పోటీపడగా, 5గురు సభ్యులు ఎన్నిక కాగా తాను మొదటిగా నిలిచానని తెలిపారు. ఈ సందర్భంగా జ్ఞాపికతోపాటుగా రూ.25 వేల చెక్కును కూడా అందుకున్నట్లు పేర్కొన్నారు.

భవనంపై మొక్కలు



డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం లైబ్రరీ బ్లాక్ వెనుక వైపు భవనం గోడపై పెద్ద మొక్కలు పుట్టాయి. ప్రస్తుతం ఊడలతో పెరుగుతున్నాయి. దీనివలన గోడలు బీటలువారి పాడైపోతున్నాయి. అందువలన ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలని విద్యార్థులు కోరారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

ఆహార ప్యాకెట్లు పంపిణీ



జిల్లా పరిషత్‌లో సోమవారం నిర్వహించిన కలెక్టర్ గ్రీవెన్స్‌లో హౌసింగ్ బోర్డు కాలనీలో ఉన్న సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో ఆహార ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఫిర్యాదుల ఇచ్చేందుకు వచ్చిన 203 మందికి ఆహారం అందజేశారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాదళ్ కన్వీనర్ ఎం.భాస్కరరావు, సభ్యులు ఎల్.అప్పారావు, లింగరాజు, కృష్ణ, వి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

– శ్రీకాకుళం కల్చరల్

శిక్షణ శిబిరం



లావేరు మండల పరిషత్ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సభ్యులకు ఉల్లాస్(సమాజంలో అందరికీ జీవితకాల అభ్యసన అవగాహన) శిక్షణ శిబిరాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమం ద్వారా అందరిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి వీడియో రూపంలో చూపించడం జరుగుతుందని ఎంపీడీవో పి.వెంకటరాజు తెలిపారు. శిక్షణకు వచ్చిన వారికి పుస్తకాలు అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకుడు రొక్కం బాలకృష్ణ, ఏపీఎం బీవీ సుబ్బయ్యానాయుడు, వెలుగు సిబ్బంది శ్రీదేవి, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల

భవనం ప్రారంభమెన్నడో..?



ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పరిపాలన భవనం

ఎచ్చెర్ల క్యాంపస్: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయంలో రూ.37 కోట్లతో నిర్మించిన పరిపాలన భవనం మూడు నెలల క్రితం పూర్తయినా ప్రారంభానికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం అధికారులు భవనం ప్రారంభోత్సవం కోసం ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యా మండలి, జిల్లాకు చెందిన మంత్రి చుట్టూ తిరుగుతున్నా కనీసం అపాయింట్‌మెంట్ దొరకడం లేదు. విద్యాశాఖ మంత్రిని కలిసే ప్రయత్నం చేస్తున్నా సాధ్యం కావడం లేదు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం వచ్చాక రాష్ట్రంలో 17 విశ్వవిద్యాలయాల్లో వీసీలు రాజీనామా చేశారు. స్థానిక వర్సిటీ అధికారులపై సైతం ఒత్తిడి తెచ్చారు. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత అనేకసార్లు ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నా వారు హాజరవ్వడం లేదు. ఇప్పటికీ అధికారులను ఎందుకు రాజీనామా చేయలేదని ప్రశ్నిస్తున్నారు. అధికారులు మాత్రం కూటమి నాయకులను ప్రసన్నం చేసుకునే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇటీవల నలుగురు అధికారులు మంత్రిని కలిసేందుకు వెళ్లగా కనీసం అపాయింట్‌మెంట్ ఇవ్వకపోవడంతో వెనుదిరిగారు. కూటమి కార్యకర్తలను కలుస్తున్న ప్రజాప్రతినిధులు, వర్సిటీ అధికారులను మాత్రం కలవడానికి ఆసక్తి చూపించకపోవడం వర్సిటీలో హాట్ టాపిక్‌గా మారింది. దీంతో పరిపాలన భవనం ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియని పరిస్థితి నెలకొంది.

లింగ నిర్ధారణ పరీక్షలు నేరం: కలెక్టర్

శ్రీకాకుళం పాతబస్టాండ్: లింగ నిర్ధారణ పరీక్షలు చేయడం, ఫలితాలు వెల్లడించడం నేరమని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ సలహా మండలి సమావేశం కలెక్టర్ అధ్యక్షతన సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంలో కలెక్టర్ మాట్లాడుతూ ఆడపిల్లల తక్కువ జననాలు సరుబుజ్జిలి, బూర్జ, ఆమదాలవలస, హిరమండలం, సంతబొమ్మాళి మండలాల్లో నమోదవుతున్నాయని, వెంటనే ఆయా చోట్ల ప్రత్యేక అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. గడిచిన మూడు నెలల కాల పరిధిలో రిజిస్ట్రేషన్, అబార్షన్, డెలివరీలు పరిశీలించి కారణాలు తెలుసుకోవాలని, ఆకస్మిక తనిఖీలు చేయాలని ఆదేశించారు. ప్రతి స్కానింగ్ సెంటర్ ఫారం ఎఫ్ తప్పకుండా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బాలబాలికలు ఇద్దరూ సమానమేనని, ఆడపిల్లలు పుట్టడం ఒక వరమని ప్రతి ఒక్కరూ గ్రహించాలని అన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి టీవీ బాలకృష్ణ మాట్లాడుతూ జిల్లాలో 114 స్కానింగ్ కేంద్రాలు ఉన్నాయని, కొత్తగా ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఏర్పాటు చేసిన పది స్కానింగ్ కేంద్రాలు మినహా మిగిలిన అన్నిచోట్ల సీసీ కెమెరాలు ఉన్నాయని, ఆయా చోట్ల ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామన్నారు. రిటైర్డ్ జడ్జి పప్పల జగన్నాథరావు మాట్లాడుతూ ఎచ్చెర్ల మండలంలో ప్రభుత్వ లేదా ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరారు.

మెరిసిన హిమసాయి శేఖర్

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం పారా బాడ్మింటన్‌లో జిల్లా క్రీడాకారుడు సతివాడ హిమసాయి శేఖర్ మరోసారి మెరిశాడు. ఈజిప్ట్ వేదికగా జరిగిన పోటీల్లో ప్రతిభ కనబరిచి కాంస్య పతకాన్ని సొంతం చేసుకున్నాడు. ఈనెల 21 నుంచి 26వ తేదీ వరకు ఈజిప్ట్‌లోని కైరా నగరం వేదికగా బీడబ్ల్యూఎస్ పారా బాడ్మింటన్ వరల్డ్ సర్క్యూట్(గ్రేడ్ 2-లెవెల్ టు) పోటీలు జరిగాయి. శ్రీకాకుళం నగరానికి చెందిన హిమసాయి శేఖర్ భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించడంతోపాటు కాంస్య పతకాన్ని దక్కించుకున్నాడు. పతకం సాధించడంపై శ్రీకాకుళం జిల్లా బాడ్మింటన్ సంఘం ప్రతినిధులు కిల్లంశెట్టి సాగర్, మెట్ట అశోక్‌కుమార్, చీఫ్ ప్యాట్రన్ డాక్టర్ గూడేన సోమేశ్వరరావు, సీఈవో సంపతిరావు సూరిబాబు, డీఎస్‌డీఓ కె.శ్రీధర్‌రావు తదితరులు సంతోషం వ్యక్తంచేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విజయదుందుబీ మోగించండి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్ర పోటీల్లో తుది వరకు పోరాడి విజయదుందుబీ మోగించడంతోపాటు టైటిల్‌తో జిల్లాకు చేరుకోవాలని జిల్లా బాస్కెట్ బాల్ అసోసియేషన్ చైర్మన్ ఎమ్మెస్సార్ కృష్ణమూర్తి ఆకాంక్షించారు. ఈనెల 28 నుంచి 31 వరకు విజయవాడ వేదికగా జరిగే ఏపీ రాష్ట్రస్థాయి బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొనే జిల్లా జట్లు సోమవారం ఇక్కడ నుంచి పయనమై వెళ్లాయి. వీరికి శ్రీకాకుళంలో వీడ్కోలు పలికిన ఎమ్మెస్సార్, పోటీలకు వెళ్లేందుకు జిల్లా జట్ల బృందానికి అవసరమైన ఆర్థిక చేయూతను అందించి తన ఉదారగుణాన్ని మరోసారి చాటుకున్నారు. ఇదిలా ఉండగా జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గత ఐదు రోజులగా శ్రీకాకుళం నగరంలోని ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ క్రీడామైదానంలో జరిగిన శిక్షణా శిబిరాల్లో రాణించిన క్రీడాకారులను జిల్లా తుది జట్లకు ఎంపికచేశారు. క్రీడాకారుల జాబితాను నిర్వాహకులు వెల్లడిచించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఏ బాస్కెట్‌బాల్ కోచ్ జి.అర్జున్‌రావురెడ్డి, మేనేజర్ బాబ్జి, జి.కొర్లయ్య, సంతోష్, రవికుమార్, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

క్రీడాకారుల జాబితా ఇది..

పురుషులు జట్టు: వి.ప్రవీణ్ (కెప్టెన్), డీఎస్‌డీఎస్ పట్నాయక్, పి.జితిన్, ఎం.కార్తీక్, పి.హేమంత్, బి.లక్ష్మీకాంత్, ఎస్.బాలాజీ, టి.చేతన్, జి.అరవింద్, కె.లోకేష్, ఎస్.దీప్, ఎస్.ఈశ్వర్‌వర్ధన్.

మహిళల జట్టు: ఎస్.ప్రేమ, సి.జె.గాయిత్రి, పి.కళ్యాణి, సీహెచ్ అక్షయ, జె.కీర్తన, జె.పూర్ణిమ, సీహెచ్ డాల్స్, జె.తమ్మి, ఎల్.ప్రమీల, సీహెచ్ రోషిని, జె.పూజ ఎంపికైనవారిలో ఉన్నారు.

జనాభా ప్రాతిపదికన కేటాయించాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): కూటమి ప్రభుత్వం రాష్ట్రంలో ఉన్న మద్యం షాపుల్లో 10 శాతం కల్లు గీత కులాలకు కేటాయించేలా జీవో జారీ చేసినా, ఆ ప్రాతిపదికన కేటాయింపులు జరగలేదని శ్రీశయన కార్పొరేషన్ మాజీ చైర్మన్ డి.పి.దేవ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జీవో ప్రకారం శ్రీకాకుళం జిల్లాలో 16 షాపులు కేటాయిస్తున్నట్లు అబ్కారీ శాఖ ప్రకటించిందన్నారు. జిల్లాలో శ్రీశయనుల జనాభా సుమారు 1.24 లక్షలున్నారని అతి తక్కువ జనాభా ప్రాంతాల్లో ఎక్కువగా షాపులు కేటాయించారని పేర్కొన్నారు. అత్యధిక జనాభా ఉన్న నరసన్నపేటకి ఒక్క షాపు కేటాయించకపోవడం దారుణమన్నారు. శ్రీకాకుళం ప్రాంతంలో సెగిడీ పేరుతో ఒక్కటి కేటాయించి శ్రీశయనులకు అన్యాయం చేశారని తెలిపారు. శ్రీశయన, సెగిడి ఒకే కులమైనప్పటికీ, వేరు వేరు కేటగిరీలో చూపి ప్రకటన వెలువడిందన్నారు. కాబట్టి ఎక్సైజ్ అధికారులు వాస్తవాలు పరిశీలించి జనాభా దామాషా ప్రకారం నోటిఫికేషన్ జారీ చేయాలని కోరారు.